ఉదయం ఏడున్నర అయింది. రాత్రంతా బస్సు ప్రయాణం చేసి వచ్చాక వేడినీళ్లతో స్నానం చేసేసరికి నేలకు మూడడుగుల ఎత్తున గాల్లో తేలిపోతున్నట్టుంది రాంబాబుకి. స్నానం చేసి వచ్చేసరికి హోటల్ నుంచి వేడి వేడి ఇడ్లీలు, చట్నీ, సాంబారు, ఫ్లాస్కులో టీతోసహా తెచ్చి సిద్ధంగా ఉంచాడు గౌరీనాథం.

"టిఫిన్ తిని, టీ తాగి పరువు ఎక్కెయ్యరా. నేను ఒకటిన్నరకొస్తా. ఇద్దరం కలసి హోటల్లో భోజనం చేద్దాం. ఓకే. ఈలోపు ఎవ్వరూ రారు, నిన్ను డిస్టర్బ్ చేయరు. శుభ్రంగా పడుకో" అప్పగింతలయ్యాక బయటకెళ్ళిపోయాడు గౌరీనాథం. రెండ్రోజులు పనిబడి హైదరాబాద్ వచ్చాడు రాంబాబు. గౌరీనాథం రూములో దిగాడు. సిటీ హడావుడికి దూరంగా చిన్నకాలనీలో ఇండిపెండెంట్ ఇల్లది. పక్కపోర్షన్లో పిల్లలు కాన్వెంటుకు బయలుదేరుతున్నారని తల్లి చేస్తున్న హడావుడిబట్టి తెలుస్తూనే వుంది.

# పజిల్

-శారదా ప్రసాద్



ఆ సందడి వింటూ టిఫిన్ తిని టీ తాగి పరువు మీద వాలిపోయాడు రాంబాబు. పదినిముషాల పాటు మగత నిద్రలో పక్క వాటాలోని మాటలు వింటూనే వున్నాడు రాంబాబు. ఆ తరువాత మత్తుగా నిద్రలోకి జారిపోయాడు. రాంబాబు నిద్ర తీరేసరికి ఒకటింపావు దాటింది. కొత్త గదిలో పరిసరాలు చూస్తూ నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. గ్లాసుడు మంచినీళ్ళు తాగి పరువు మీద కూర్చున్నాడు. పక్కవాటాకు, గదికి మధ్య తలుపే అడ్డం. అక్కడి మాటలన్నీ స్పష్టంగా వినిపిస్తున్నాయి రాంబాబుకి. వినిపిస్తున్న మాటల్నిబట్టి పొద్దుటికీ, ఇప్పటికీ ఆ వాటాలో సీనరీ మారిపోయినట్లు తెలుస్తోంది. ఆవిడ గొంతుతోపాటు ఆమె భర్త మాటలు కూడా వినిపిస్తున్నాయి. అతన్ని ఆవిడ పిలుస్తున్న తీరునుబట్టి ఇద్దరూ భార్యాభర్తలని తెలుస్తోంది. ఇద్దరూ భోజనాలు చేస్తూ మాట్లాడుకుంటున్నారు.

"ఎన్నిగంటల బస్సుకు తీసారు టిక్కెట్లు?"

"రాత్రి పదిన్నరకు బయలుదేరుతుంది అమీర్‌పేట నుంచి."

"ఇంట్లో తొమ్మిదిన్నరకు బయలుదేరితే చాలుగా!"

"చాలుగానీ సర్దటాలు పూర్తయ్యాయా?"

"అయినట్టేగానీ ఏమిటి మీరు 'కోనేటి కొంగ' కుర్తా పైజమా సర్దారు పెట్లో. అది పాతబడిపోయింది. 'కుంభాభిషేకం' డ్రస్సు పెట్టుకోండి బావుంటుంది."

"అంత పాతబడిపోలేదది. ఉండనీ. నువ్వు 'దేశంకోసం' చీర, 'దేవదాసి' చీర, జాకెట్టు దాచి పెట్టుకున్నావు ఈ ప్రయాణం గురించి. సర్దుకున్నావా? 'వీడని కల' దుద్దులు బాగా మ్యాచ్ అవుతాయి ఆ చీరలకి. తెచ్చుకోవడం మర్చిపోకు."

"మీ 'రేసుగుర్రం' బూట్లు, 'దెయ్యాల వాడ' కళ్లజోడూ తెచ్చుకోండి. చూసి మీ తోడల్లుడు డంగైపోతాడు."

కొంతసేపు మౌనం. రాంబాబుకి వాళ్ల మాటల్లో ఒక్క ముక్క కూడా అర్థం కావడంలేదు. తెలుగే వింటున్నానా? విన్న మాటలన్నీ గుర్తుకు తెచ్చుకుని అర్థాలు వెతుకుతున్నాడు.

మళ్ళీ ఆవిడే అంది. "బస్సులో 'ఆటోవాలా' టీషర్టు వేసుకోండి. రాత్రిపూట కంఫర్టబుల్‌గా వుంటుంది."

"అదిసరే. 'విపరీతార్థాలు' గాజులసెట్టులో గాజొకటి రిపేరుకొచ్చిందన్నావు. బాగు చేయించుకున్నావా?"

"రిపేరంటే గుర్తొచ్చింది. 'రామదండు' సూటుకేసు జిప్పు బాగు చేయించారా? 'గాయత్రీ మంత్రం' ఎయిర్‌బ్యాగ్‌లో బట్టలన్నీ సరిపోవు."

"అయింది. పిల్లల్ని రెండ్రోజులు మీ పిన్ని ఇంటికి కూడా పంపిద్దామనుకున్నాంగా అక్కడినుంచి. అందుకే వాళ్ల బట్టలన్నీ 'దిగుడుబావి' పెట్లో విడిగా సర్దు. ఆ పెట్టె అలా పట్టుకుపోతారిద్దరూ. 'కర్రపెత్తనం' తువాళ్ళు నాలుగు చిరుగులు పట్టిపోయాయి. కొత్తవి కొనాలి ఇంకో సెట్టు."

"'భోళాశంకరుడు' డబ్బులు రానీ, కొందాం. రాత్రికి చలి బాగా ఉండేలా వుంది. 'దేశద్రోహి' దుప్పటి పాలిథీన్ కవర్లో విడిగా పైన పెట్టు. పిల్లలిద్దరూ ఒకే సీటు కాబట్టి కప్పుకుంటారు."

రాంబాబుకి నిద్ర మత్తు పూర్తిగా వదిలిపోయింది. ఎప్పుడూ వినని భాష వినేకొద్దీ తల వేడెక్కిపోతోంది. ఆ మాటలు వినబడుతున్న వేపే తీక్షణంగా చూస్తున్నాడు.

"'పిచ్చిపుల్లమ్మ' వాక్‌మన్‌లో బ్యాటరీలు వేసి వుంచు. నువ్వే కావాలి పాటలు వినాలి రాత్రి బస్సులో."

కొంచెంసేపు నిశ్శబ్దం తరువాత "ఆ 'కపాల మోక్షం' కళాయి మరీ జిడ్డెక్కి మాడిపోయి, సొట్టలుబోయింది. అది తోమడానికి వేసిన ప్రతిసారీ మాడు వదలగొట్టలేనని గోల పెడుతోంది కిష్టమ్మ. ఈసారి కొత్తది తీసుకోవాలి."

"సరే."

మతి చలించడం మొదలుపెట్టింది రాంబాబుకి. పక్కవాటాలోవాళ్ళు మనుష్యులేనా లేక గ్రహాంతర వాసులా? అని కూడా భయపడ్డాడు. అప్పుడే తలుపులు కొట్టిన చప్పుడయింది. గౌరీనాథం వచ్చాడు.

"లేవరా! లుంగీ మార్చు. భోజనానికి వెళదాం."

వాడి మాటలు విన్నాక భూమిమీద మామూలు మనుష్యుల మధ్యనే వున్నాననిపించింది రాంబాబుకి. ఇద్దరూ హోటల్లో కూర్చున్నాక అడిగాడు రాంబాబు "నీ పక్క వాటాలో వాళ్ళు ఎవర్రా? తెలుగే మాట్లాడుకుంటారా వాళ్ళు? అదేదో ఆటోవాలా టీషర్టట, దెయ్యాల కళ్లజోడట, ఏదో దుప్పటటా... ఏంట్రా ఆ భాష?"

రాంబాబు అడుగుతుండగా అర్థం అయిపోయి గట్టిగా నవ్వేశాడు గౌరీనాథం.

"నీకిదంతా కొత్తరా బాబూ. నాకూ కొత్తల్లో కొన్ని రోజులు అర్థం కాలేదు. ఆ తరువాత తెలిసిందంతా. ఆ భార్యాభర్తలిద్దరూ కథలూ, నవలలు రాస్తుంటారు. వాళ్లింట్లో ఏ వస్తువు ఏ కథకొచ్చిన రెమ్యూనరేషన్‌తో కొన్నారో ఇద్దరికీ గుర్తే. ఏ కథ డబ్బులతో కొన్న వస్తువును ఆ కథ పేరుతోనే పిలుస్తారు. నువ్వు విన్నావు చూడు ఆటోవాలా టీషర్టని, ఆ టీషర్టు 'ఆటోవాలా' అనే కథ పత్రికలో పడ్డప్పుడు వచ్చిన రెమ్యూనరేషన్‌తో కొనుక్కున్నాడాయన. అదీ సంగతి. పజిల్ విడిపోయిందా ఇప్పుడు?"

విషయం అర్థమయినా నా మస్తిష్కం ఆ దంపతుల మాటలను మళ్ళీ గుర్తు చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. 'దేవదాసి' చీర, జాకెట్టు, 'కోనేటి కొంగ' కుర్తా, పైజమా... 'కర్రపెత్తనం' తువాళ్ళు...' అంటూ.

★